

యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

● ఏపీఈపీడీసీఎల్ డీఈ రంగారావు

సాలూరు రూరల్,జూలై 3: ఏపీఈపీడీసీఎల్ పవర్ యాప్, వెబ్‌సైట్‌ను వినియోగించి విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చని సాలూరు డీఈ రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం ఫోన్ పే, జీ పే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపు కుదరదన్నారు. ఈస్టర్న్ పవర్ యాప్, వెబ్‌సైట్ ద్వారా చెల్లింపు జరిపేటప్పుడు యూపీఐ యాప్‌లు, డెబిట్ /క్రెడిట్, నెట్‌బ్యాకింగ్, వ్యాలెట్స్, క్యాష్‌కార్డ్‌లు వినియోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

నిగ్గు తేలేనా?


● జగనన్న లేవుట్ల భూముల కొనుగోలులో అవినీతి అక్రమాలు

● నివాస యోగ్యం కాని స్థలాలకు భారీగా ధర చెల్లింపు

● దీనివెనుక కొంతమంది వైసీపీ నేతలు, అధికారులు ఉన్నట్లు ఆరోపణలు

● ప్రత్యేక కమిటీతో విచారణ జరిపిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి..

● నూతన సర్కారు స్పందించాలని జిల్లావాసుల విన్నపం



మక్కువ మండలంలో జగనన్న లేఅవుట్ ఇలా..

పార్వతీపురం, జూలై 3 (ఆంధ్రజ్యోతి)

'అర్హులందరికీ ఉచితంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేశాం.. పేదల సొంతింటి కల నెరవేర్చాం..' అని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. జగనన్న లే అవుట్లన్నీ ఊళ్లుగా మారుబోతున్నాయని ప్రకటించింది. అయితే క్షేత్రస్థాయిలో నెలకొన్న భిన్న పరిస్థితులు కారణంగా ఆశించిన స్థాయిలో గృహ నిర్మాణాలు జరగలేదు. మరోవైపు పేదలకు కేటాయించిన స్థలాల కొనుగోలు విషయంలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగనన్న లేఅవుట్ల కోసం నివాస యోగ్యం కాని స్థలాలను అప్పట్లో కొంతమంది వైసీపీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు ఒక్కటై.. భారీ ధరకు కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంలో జరిగిన అవినీతి నిగ్గు తేలాల్సి ఉందని, దీనిపై నూతన సర్కారు స్పందించి ప్రత్యేక కమిటీతో విచారణ జరిపించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు నిలా..

జగనన్న కాలనీల కోసం కొనుగోలు చేసిన భూముల్లో లేఅవుట్లు వేసి ప్లాట్లుగా విభజించారు. లబ్ధిదారులకు స్థలాలను కేటాయించారు. అయితే ఆ స్థలాలు ప్రజలకు అనుకూలంగా లేవనేది వాస్తవం. జనసంచారానికి దూరంగా, కొండలు, గుట్టల్లో వేసిన ఈ లేఅవుట్లలో మౌలిక వసతులు కూడా కల్పించలేదు. కొన్ని మండలాల్లో మంజూరు చేసిన స్థలాలు కూడా నిర్మాణాలకు అనుకూలంగా లేనివనే చెప్పొచ్చు. మరోవైపు నిర్మాణాలకు సంబంధించి మెటీరియల్ ధరలు పెరిగిపోవడం, ప్రభుత్వ సాయం చాలకపోవడంతో చాలామంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు పూర్తయిన గృహాలు 2,388 మాత్రమే. మొత్తంగా 342 లేఅవుట్‌లు వస్తే 220 లేఅవుట్‌లో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాల పరిస్థితి దారుణంగా ఉంది. నాలుగు నియోజకవర్గాల్లో 10,630 ఇళ్లు మంజూరు కాగా కేవలం 2,388 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. ఇందులో 380 ఇళ్లు పూర్తిగా ప్రారంభం కాలేదు. బీబీఎల్ లెవెల్‌లో 2,524, బీబీ లెవెల్‌లో 736, బీఎల్ లెవెల్‌లో 1,645, ఎల్ఎల్ లెవెల్‌లో 2,207, ఆర్ఎల్ స్టేజీలో 519, ఆర్‌సీ స్టేజీలో 231 ఉన్నాయి.

సొంత స్థలాల్లో....

సొంత స్థలాలు కలిగిన వారికి ఇళ్లు మంజూరు చేయగా.. జిల్లాలో 10,778 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే 14,452 బిల్లులు మంజూరైనట్లు తెలుస్తోంది. కొంతమంది వైసీపీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు హౌసింగ్ శాఖ అధికారులు పాత ఇళ్లకు సైతం బిల్లులు చెల్లించారనే ఆరోపణలున్నాయి. పార్వతీపురం నియోజకవర్గంలోని బలిజిపేట, సీతానగరం మండలాల్లో ఈ విధంగా బిల్లులు చెల్లించారనే ఆరోపణలున్నాయి. దీనిపై ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపిస్తే.. మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

పార్వతీపురం నియోజకవర్గంలో..

పార్వతీపురం పట్టణ లబ్ధిదారుల కోసం నర్సిపురం పంచాయతీ పరిధిలో కొనుగోలు చేసిన స్థలాల విషయంలోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. 457, 482, 485, 488, 489 సర్వే నెంబర్లు పరిధిలో సుమారు 15 ఎకరాలు కొనుగోలు చేశారు. ఈ ప్రాంతంలో 748 మందికి జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చారు. కానీ ఇక్కడ ఒక్క గృహ నిర్మాణం కూడా పూర్తి కాలేదు. నివాస యోగ్యం కాని స్థలాలను కేటాయించడమే ఇందుకు కారణం. కాగా కనీసం రూ. పది లక్షల విలువ కూడా చేయని ఎకరా భూమిని సుమారు రూ.25 లక్షలకు కొనుగోలు చేశారు. అప్పట్లోనే ఈ భూముల కొనుగోలుపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమైనా గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అప్పటి గృహ నిర్మాణ శాఖ మంత్రి రంగనాథరాజు జిల్లా పర్యటన వచ్చినప్పుడు.. ఆ భూమిని చూసి 'మీరైతే ఇక్కడ ఇళ్లు కట్టుకొని ఉండగలరా?' అని ప్రజాపతినిధులతో పాటు అధికారులను ప్రశ్నించారు. పార్వతీపురం మండలం పెద్దమరికి పంచాయతీ శివందొరవలస ప్రాంతంలో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసి పట్టణ లబ్ధిదారులకు స్థలాలను కేటాయించారు. ఈ ప్రాంతం పట్టణానికి దూరంగా ఉండడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించేందుకు ముందు రావడం లేదు. ఇక్కడ భూమి కొనుగోలులో కూడా భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు లేకపోలేదు.



పార్వతీపురం మండలంలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఇదీ...

పాలకొండ, సాలూరులో..

పాలకొండ గ్రామీణ ప్రాంతంలోని సర్వే నెంబర్లు 428, 429లో ఎకరా రూ.40 లక్షల చొప్పున 8 ఎకరాలను, అదే ప్రాంతంలో మరో 25 ఎకరాలను ఎకరా రూ. 35 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో లేని భూములను అధిక ధరలకు కొనుగోలు చేసి.. ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టారు. ఈ విషయంలో కొంతమంది వైసీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కై.. య్యారనే ఆరోపణలున్నాయి. అదే విధంగా సాలూరు నియోజకవర్గం గుమడం లేఅవుట్‌లో భూములను సైతం అధిక ధరలకు కొనుగోలు చేశారనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కమిటీ వేస్తాం..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్లకు సంబంధించి భూముల కొనుగోలులో అవినీతి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన వారిని వదిలే ప్రసక్తే లేదు. దీనిపై జిల్లా స్థాయిలో కమిటీ వేస్తాం.

-గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన శాఖ మంత్రి

ఎవరినీ వదలం..

జగనన్న లేఅవుట్ల భూముల కొనుగోలులో జరిగిన అవినీతికి సంబంధించి అప్పటి అధికారులు ఎక్కడ పనిచేసినా వారిని వదిలేది లేదు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతాం.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ

పేదలకు ఇసుక ఉచితం

● ఈనెల 8 నుంచి అమలు చేయాలని సీఎం ఆదేశం

● ముందుగా స్టాక్ పాయింట్ల ద్వారా పంపిణీ

● హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు



పార్వతీపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నూతన ఇసుక పాలసీ అమలుకు సంబంధించి సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 8వ తేదీ నుంచి ముందుగా నిల్వ పాయింట్లు ద్వారా ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని సూచించారు. కాగా దీనిపై త్వరలోనే విధి విధానాలు జారీ కానున్నాయి. సర్కారు తాజా నిర్ణయంతో ఉచిత ఇసుక విధానం అమలుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. వర్షాకాలం కావడంతో ప్రస్తుతం రీచ్‌ల్లోకి వెళ్లే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో పేద ప్రజలు ఇబ్బంది పడకుండా మూడు నెలల పాటు స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుకను ఉచితంగా అందించనున్నారు. పేదల గృహ నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక ఇవ్వాలని నూతన సర్కారు ఆదేశాలతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ఉపాధికి ఢోకా ఉండదని, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని మరోవైపు భవన నిర్మాణ కార్మికులు చెబుతున్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ...

వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక నూతన విధానం అమలులోకి తెచ్చింది. స్టాక్ పాయింట్ల ద్వారా ప్రభుత్వమే తక్కువ ధరకు ప్రజలకు ఇసుక అందిస్తుందని ప్రకటించి అన్ని వర్గాలను మోసగించింది. మొత్తంగా గత ఐదేళ్ల కాలంలో జిల్లాలో అడ్డగోలుగా ఇసుక దోపిడీ జరిగింది. గ్రామస్థాయి కార్యకర్త నుంచి కొంతమంది ఎమ్మెల్యేలు ఇందులో భాగస్వాములయ్యారనే ఆరోపణలు లేకపోలేదు. జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లను కొంతమంది వైసీపీ నేతలు తమ అడ్డాగా మార్చుకున్నారు. నిబంధనలు తుంగలో తొక్కారు. అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపారు. పెద్ద పెద్ద లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను తరలించారు. పేదలు, మధ్య తరగతి వర్గాలకు ఇసుక దొరక్కుండా చేశారు. ఇసుక ధరలను అమాంతం పెంచి అన్ని వర్గాలనూ ఇబ్బంది పెట్టారు. సామాన్యులు ఇళ్లు కట్టుకోలేని స్థితికి తెచ్చారు. యథేచ్ఛగా తమ దందాను కొనసాగించి ఐదేళ్ల కాలంలో భారీగా సంపాదించారు. అధికార యంత్రాంగం కళ్లు మూసుకోవడంతో వారి దందా మూడు పూలు.. ఆరు కాయలు అన్న చందంగా సాగింది. కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నాయకుల ఆదేశాల మేరకు.. వారు చెప్పిన ధరకు ఇసుక విక్రయాలు జరిగేవి. మొత్తంగా గత వైసీపీ సర్కారు తీరుతో గృహ నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతింది. ఇసుక దొరక్కపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులు పనులకు దూరమయ్యారు. కొందరు ఇతర రాష్ట్రాలకు వలసపోగా.. మరికొందరు రోడ్డెక్కి ధర్నాలు చేశారు. అయినా గత వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు.

ఆనందంగా ఉంది

ఉచిత ఇసుక విధానం వల్ల మా లాంటి ట్రాక్టర్ యజమానులకు పూర్తిస్థాయిలో ఉపాధి దొరుకుతుంది. లక్షలాది రూపాయల బ్యాంకు రుణంతో ట్రాక్టర్లు కొనుగోలు చేశాం. అయితే గత వైసీపీ ప్రభుత్వ కాలంలో నెలవారి వాయిదాలను కట్టుకోలేక.. తిరిగి ట్రాక్టర్లను అమ్మకోవాల్సిన పరిస్థితి వచ్చింది. తాజాగా టీడీపీ సర్కారు తీసుకున్న నిర్ణయం.. చాలా మంచిది. మా లాంటి వారికి ఏ ఇబ్బంది ఉండదు. ఎంతో ఆనందంగా ఉంది.

- రమేష్, ట్రాక్టర్ యజమాని, పార్వతీపురం

ఉపాధి దొరుకుతుంది

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఇసుక విధానం వల్ల మాకు ఉపాధి లేకుండాపోయింది. దీనివల్ల వలస కూలీలుగా మారిపోయాం. పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాం. అయితే తాజాగా టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని నిర్ణయించడం ఆనందంగా ఉంది. మాలాంటి భవన నిర్మాణ కార్మికులందరికీ ఉపాధి లభిస్తుంది.

- టి.తిరుపతి, భవన నిర్మాణ కార్మికుడు, పార్వతీపురం

20ఏళ్ల ప్రతిపాదనలకు మోక్షం

● పైడిమాంబ దేవస్థానం విస్తరణకు గ్రీన్‌సిగ్నల్



విజయనగరం రూరల్: పైడిమాంబ దేవాలయ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది.. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. వాస్తవానికి నగర జనాభా బాగా పెరిగింది.. ఏటా పైడిమాంబ ఆలయానికి వస్తున్న భక్తుల సంఖ్య కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో నగరంలోని మూడులాంతర్ల వద్ద నున్న చదురుగుడి విస్తరించాలని ప్రతి భక్తుడు కోరుకుంటున్నాడు. ఈ ప్రతిపాదన ఈ నాటికి కాదు. 20 ఏళ్ల కిందటే తెరపైకి వచ్చింది. వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి పెట్టింది. దీంతో విస్తరణ దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇప్పటికే ఖాళీగా ఉన్న స్థలంలో క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్, అన్నదాన సత్రం తదితర వాటిని దేవదాయ శాఖ ఏర్పాటు చేసి తాత్కాలికంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తోంది. ఎంత మంది భక్తులు వచ్చినా దర్శనం వేగంగా పూర్తి అయ్యేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవదాయశాఖ ఇంజినీరింగు విభాగం అధికారులు గత నెల 28న పైడిమాంబ దేవస్థానం ప్రస్తుత పరిస్థితి.. తాజాగా సేకరించిన స్థలం... ఎంత స్థలంలో ఆలయాన్ని విస్తరించవచ్చు.. తదితర అంశాలను పరిశీలించారు. ఈ నెల 10లోగా ఆలయ విస్తరణ ప్లాన్‌లు సిద్ధం కానున్నాయి. ఆ వెంటనే డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ని సిద్ధం చేస్తారు.. అంతకుముందు ఆలయ విస్తరణకు సంబంధించి సిద్ధాంతులు, స్వామీజీల సలహాలు, సూచనలు కూడా తీసుకుంటారు. వాస్తుపరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ విస్తరణకు రంగం సిద్ధం కానుంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే శ్రావణ మాసంలో పనులు జరగనున్నాయి. అక్టోబరులో సిరిమానోత్సవం నేపథ్యంలో ఆ ప్రక్రియకు ఇబ్బంది లేకుండా దేవదాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

7న విధుల్లో చేరనున్న కొత్త కలెక్టర్

పార్వతీపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా నియామకమైన ఎ.శ్యాంప్రసాద్ ఈ నెల 7న విధుల్లో చేరనున్నట్టు చెప్పారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా 7న బాధ్యతలు స్వీకరిస్తానని ఆయన చెప్పారు. కాగా ఈ మేరకు కలెక్టరేట్ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

నేడు అల్లూరి జయంతి

పార్వతీపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విధిగా అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలన్నారు.

7న రథయాత్ర ఉత్సవాలు: ఆర్డీవో

పాలకొండ: పట్టణంలోని ఈ నెల 7న జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయని, సంబరాలు వైభవంగా నిర్వహించాలని ఆర్డీవో వెంకటరమణ ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని , భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆలయ పరిసరాలను శుభ్రం చేయించాలలని నగర పంచాయతీ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వరహాలు, మున్సిపల్, హెల్త్, ఎలక్ట్రికల్, ఫైర్ శాఖ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

● **చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన**

సీతంపేట: చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు గాను పాత పనుకువలస సమీపంలో ఉన్న 30 ఎకరాల స్థలాన్ని పాలకొండ ఆర్డీవో వెంకటరమణ బుధవారం పరిశీలించారు. మరికొన్ని స్థలాలు పరిశీలించి తమకు నివేదిక అందించాలని ఆర్డీవో సంబంధిత సిబ్బందికి సూచించారు.

వ్యాధుల కలకలం

● ప్రబలుతున్న డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు ● ఆసుపత్రులకు పరుగులు తీస్తున్న రోగులు

జియ్యమ్మవలస, జూలై 3 : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వాతావరణం మార్పు, పారిశుధ్య లోపం, కలుషిత నీరు తదితర కారణాల వల్ల డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. కుటుంబంలో ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. రోజులు గడుస్తున్నా.. పరిస్థితి మెరుగవకపోవడంతో అత్యధికులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

చినమేరంగిలో డెంగ్యూ లక్షణాలు

చినమేరంగిలో ఎనిమిది మందికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జగదీష్ తెలిపారు. ఆ గ్రామానికి చెందిన మీసాల కారుణ్య, రిసి, శ్యామల, సిరిపురపు కల్పన, బొమ్మాళి పకీరు, మోహనరావు, శ్రీధర్, లక్ష్మిలు కొద్దిరోజులుగా చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. అయితే ఇటీవల వీరి రక్త నమూనాలు తీసి జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపగా అన్నీ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యుడు పి.జగదీష్ తెలిపారు. మరోవైపు పంచాయతీ సిబ్బంది అప్రమత్తమైంది. ఇన్‌చార్జి పంచాయతీ విస్తరణాధికారి కొండగొర్రి రామారావు, పంచాయతీ కార్యదర్శి బి. రామకృష్ణలు గత మూడు రోజులుగా ఆ గ్రామంలో కాలువల పూడి కతీతలు, పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించడం వంటి పనులు చేయిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్ బుధవారం చినమేరంగిలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి జ్వరం వచ్చినా గ్రామంలో ఉన్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లకు తెలియజేయాలని ఆయన సూచించారు.

గిరిజన ప్రాంతాల్లో ...

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం గిరిజన ప్రాంతాల్లో మలేరియా, టైఫాయిడ్ వైరల్ ఫీవర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. గుమ్మలక్ష్మీపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు జ్వర లక్షణాలతో రోజూ సుమారు 200 వరకు రోగులు వస్తున్నారు. తాడికొండ, రేగిడి, దుడ్డుకల్లు, కురుపాం, మండెంకల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ జ్వర బాధితులు పెరిగారు.



చినమేరంగి సీహెచ్‌సీలో జ్వర బాధితులు ఇలా..

● భద్రగిరి సీహెచ్‌సీలోనూ రోజుకు 150 నుంచి 200 వరకు ఓపీ కేసులు నమోదవుతున్నాయి. అయితే ఈ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా అనేక పీహెచ్‌సీల్లో మలేరియా మందులు కూడా లేకపోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

● గురుకులాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోనూ విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు. అస్వస్థతకు గురైన వారిని సమీపంలో ఆసుపత్రికి తరలిస్తున్నారు. దీనిపై భద్రగిరి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్‌ను వివరణ కోరగా..జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను ఏఎన్ఎంల పర్యవేక్షణలో ఆసుపత్రికి పంపిస్తున్నామన్నారు. జ్వరాల తీవ్రత తగ్గేవరకు గిరిజన ప్రాంతంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, కావాల్సిన మందులు కూడా అందుబాటులో ఉంచాలని గిరిజన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



భద్రగిరి సీహెచ్‌సీలో ఒకే మంచంపై చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

ఐబీపీఎస్ క్లర్క్ ఎగ్జామ్ 2024

ముఖ్యమైన పది అంశాలు



వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 6,128 క్లర్క్ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. అర్హులైన అభ్యర్థులు జూలై 21లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియలో ఏయే బ్యాంకులు పాల్గొంటున్నాయి. ఎలా దరఖాస్తు చేసుకోవాలి? దరఖాస్తు చేసే ముందు ఏయే అంశాలను గమనంలోకి తీసుకోవాలి? పరీక్ష విధానం ఎలా ఉంటుంది? ఆఫర్ లెటర్ అందుకున్న తరవాత ఉద్యోగంలో చేరబోయే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? వివరాలు చూద్దాం..!

1. ఈ భర్తీ ప్రక్రియలో దేశవ్యాప్తంగా మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు పాల్గొంటున్నాయి.
2. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 1996 జూలై 1కి ముందు గానీ, 2004 జూలై 1 తరవాత గానీ జన్మించి ఉండకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
3. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్‌లో సర్టిఫికెట్/డిప్లొమా/డిగ్రీ కోర్సు చేసి ఉండాలి లేదా హైస్కూల్/కాలేజీ స్థాయిలో కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. అభ్యర్థులకు తాము దరఖాస్తు చేస్తున్న ప్రాంతానికి సంబంధించిన అధికార భాషలో తగిన ప్రావీణ్యం ఉండాలి.
4. పైన పేర్కొన్న అన్ని అర్హతలతో పాటు తప్పనిసరిగా ఉండాల్సిన మరో అర్హత హెల్తీ క్రెడిట్ హిస్టరీ(మంచి రుణ చరిత్ర). ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరే ముందు సంబంధిత బ్యాంకులు తప్పనిసరిగా క్రెడిట్ హిస్టరీ చెక్ చేస్తాయి. కాబట్టి అభ్యర్థులు సిబిల్ స్టేటస్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. ఒకవేళ సిబిల్ స్కోరు అప్‌డేట్ కాని పక్షంలో... ఇంతకు ముందే ఏదైనా బ్యాంకు/సంస్థ నుంచి రుణం తీసుకుని చెల్లించిన అభ్యర్థులు.. సదరు బ్యాంక్/సంస్థ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ)ని తీసుకోవాలి. అలా చేయని పక్షంలో ఇచ్చిన ఆఫర్ లెటర్‌ను బ్యాంక్ క్యాన్సిల్ చేసే ప్రమాదం ఉంటుంది.
5. ఇక పరీక్ష విషయానికొస్తే...ఐబీపీఎస్ క్లర్క్ ప్రిలిమ్స్ ఎగ్జామ్‌ని 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ప్రశ్న పత్రంలో మూడు విభాగాలు ఉంటాయి.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	సమయం
ఇంగ్లీష్ లాంగ్వేజ్	30	30	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35	35	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35	35	20 నిమిషాలు
మొత్తం	**100**	**100**	**60 నిమిషాలు**

6. అభ్యర్థులు ప్రతి సెక్షన్‌లోనూ ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించాల్సి ఉంటుంది. ప్రిలిమ్స్ సాధించిన మెరిట్ మేరకు ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షకు అభ్యర్థులను ఐబీపీఎస్ షార్ట్‌లిస్ట్ చేస్తుంది.
7. మెయిన్స్ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం 190 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 160 నిమిషాలు. ప్రశ్న పత్రంలో నాలుగు విభాగాలు ఉంటాయి.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50	50
జనరల్ ఇంగ్లీష్	40	40
రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్	50	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	60

8. మొదటి రెండు విభాగాల్లో ప్రతి విభాగానికి 35 నిమిషాలు, తరవాత రెండు విభాగాల్లో ప్రతి దానికి 45 నిమిషాల సమయాన్ని ఐబీపీఎస్ నిర్దేశించింది. ఒక వేళ ఏమైనా మార్పులు చేర్పులు ఉన్నట్లయితే ఐబీపీఎస్ ఆ సమాచారాన్ని తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతుంది. కాబట్టి అభ్యర్థులు తరచుగా ఐబీపీఎస్ వెబ్‌సైట్‌ను చెక్ చేస్తూ ఉండాలి. ఇక పరీక్ష విధానానికి సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన ఇన్ఫర్మేషన్ హ్యాండ్ అవుట్‌ను ఐబీపీఎస్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
9. ఇక్కడ అభ్యర్థులు గమనించాల్సిన మరో ముఖ్య విషయం ఏమిటంటే.. నెగెటివ్ మార్కింగ్ విధానాన్ని ఐబీపీఎస్ అమలు చేస్తుంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి నాలుగో వంతు(0.25) మార్క్ కట్ చేస్తుంది. ఒకవేళ అభ్యర్థి సమాధానం గుర్తించకుండా ఖాళీగా వదిలిపెడితే మార్కుల్లో ఎలాంటి కోత ఉండదు
10. అభ్యర్థులు ఐబీపీఎస్ నిర్దేశించిన కనీస మార్కులు(కటాఫ్) తప్పనిసరిగా సాధించాలి. అయితే ఈ కటాఫ్ మార్కులను రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆ సమయానికి బ్యాంకుల్లో ఉన్న ఖాళీల సంఖ్యను బట్టి ఐబీపీఎస్ నిర్దేశిస్తుంది. ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ప్రాసెస్ పూర్తయ్యే వరకూ మెయిన్స్ మార్కులను ఐబీపీఎస్ వెల్లడించదు.

ఖాళీలు ఉన్న బ్యాంకులు

- బ్యాంక్ ఆఫ్ బరోడా
- కెనరా బ్యాంక్
- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
- యూకో బ్యాంక్
- బ్యాంక్ ఆఫ్ ఇండియా
- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- పంజాబ్ నేషనల్ బ్యాంక్
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
- ఇండియన్ బ్యాంక్
- పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్

మొత్తం ఖాళీలు: 6,128
ఆంధ్రప్రదేశ్‌లో: 105, తెలంగాణలో: 104
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:
తెలంగాణ: హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్.
ఆంధ్రప్రదేశ్: గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం.

IBPS Institute of Banking Personnel Selection

దిక్సూచి DIKSUCHI

నోయిడాలోని హిందుస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్(హెచ్‌సీఎల్) టెక్నాలజీస్ - 'టెక్‌బీ' ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అభ్యర్థులు ఐటీ ఉద్యోగులుగా రాణించేందుకు, అసోసియేట్స్‌గా ఎదిగేందుకు ఈ ప్రోగ్రామ్ తోడ్పడుతుంది. సంస్థ నిర్వహించే కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్), వర్సంట్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. హైదరాబాద్, విజయవాడ సహా నోయిడా, లఖ్‌నవూ, నాగ్‌పూర్, చెన్నైలలో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/డిజైన్ ఇంజనీర్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు. ఆసక్తిగలవారు ఉద్యోగం చేస్తూనే బిట్స్ పిలానీ, ఐఐఐటీ కొట్టాయం, అమిటి యూనివర్సిటీ(ఆన్‌లైన్), కేఎల్ యూనివర్సిటీ, శస్త్ర యూనివర్సిటీలలో చదువుకునే అవకాశం ఉంది. సంబంధిత గ్రాడ్యుయేషన్ కోర్సులకయ్యే ఖర్చును నిబంధనల ప్రకారం సంస్థ భరిస్తుంది.

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో టెక్‌బీ ప్రోగ్రామ్



విభాగాలు: డెవలప్ అప్లికేషన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, కోడింగ్, టెస్టింగ్ ఇంజనీర్, అనలిస్ట్, ప్రొడక్ట్ అండ్ అప్లికేషన్, డిటెక్టింగ్ బగ్స్ అండ్ రన్నింగ్ డయాగ్నస్టిక్స్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజైన్ ఇంజనీర్, ప్రొడక్ట్ అండ్ అప్లికేషన్ డిజైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, వెబ్ సర్వర్ డెప్లాయ్‌మెంట్, ప్రాసెస్ ఆటోమేషన్, సెక్యూరిటీ పాలసీ ఇంప్లిమెంటేషన్

ప్రోగ్రామ్ వివరాలు: దీనిని హైబ్రిడ్(ఆన్‌లైన్ సెషన్స్, తరగతి గది బోధన) విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొదట ఐటీ ఫౌండేషన్ అంశాలు బోధిస్తారు. ఐటీ ఫండమెంటల్స్, ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవసరమయ్యే అంశాలు వివరిస్తారు. తరవాత ట్రెయినింగ్ ఫర్ జాబ్ సెషన్స్ ఉంటాయి. ఇందులో జాబ్ బేస్డ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సిమ్యులేషన్స్, కేస్ బేస్డ్ ప్రాక్టికల్ కరిక్యులమ్, పీర్ బేస్డ్ డిస్కషన్స్, లైఫ్ కోచెస్ టూల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. సంస్థకు చెందిన గ్లోబల్ ప్రాజెక్ట్‌లలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను సంస్థ అందిస్తుంది. అభ్యర్థులు సమయానుసారం అసెస్‌మెంట్‌లు, అసైన్‌మెంట్‌లు సబ్మిట్ చేయాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి /తత్సమాన పరీక్ష (2023/2024) ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీ విభాగాలకు మేథమెటిక్స్/బిజినెస్ మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఇందులో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఐఐటీ జేఈఈ మెయిన్ 2023లో కనీసం 80 పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు హెచ్‌సీఎల్ కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్) రాయనవసరం లేదు. వీరిని నేరుగా వర్సంట్ టెస్ట్, ఇంటర్వ్యూలకు అనుమతిస్తారు.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థులు ముందుగా కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్) రాయాల్సి ఉంటుంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ రీజనింగ్(మేథమెటిక్స్), లాజికల్ రీజనింగ్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్ స్థాయిలో ప్రశ్నలు ఉం టాయి. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులను వర్సంట్ టెస్ట్‌కు పిలుస్తారు. ఇందులో స్పోకెన్ ఇంగ్లీష్, లాంగ్వేజ్ స్కిల్స్ పరీక్షిస్తారు. తరవాత ఫేస్ టు ఫేస్ ఇంటరాక్షన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ఉన్నత విద్యావకాశాలు: హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రామ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగంలో చేరిన తరవాత ఆసక్తి మేరకు పై చదువులు చదువుకోవచ్చు. శస్త్ర యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ, రెండేళ్ల ఎంసీఏ/ఎమ్మెస్సీ డేటా సైన్స్; బిట్స్ పిలానీలో నాలుగేళ్ల బీఎస్సీ(డిజైన్ అండ్ కంప్యూటింగ్), వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు(బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీ); అమిటి యూనివర్సిటీ(ఆన్‌లైన్)లో మూడేళ్ల వ్యవధి గల బీకాం/బీసీఏ/బీబీఏ/బీఎస్సీ, రెండేళ్ల ఎంబీఏ/ఎంసీఏ; కేఎల్ యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ; ఐఐఐటీ కొట్టాయంలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ కోర్సుల్లో చేరవచ్చు.

- దరఖాస్తు ఫీజు లేదు
- **వెబ్‌సైట్:** hcltechbee.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/DurXispలో
చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్



ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాల సూపర్ హిట్ కాంబో విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి, దిల్ రాజు హ్యాట్రిక్ ఇవ్వడం కోసం మళ్లీ చేతులు కలిపారు. దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనరుపై శిరీష్ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ బుధవారం రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. వెంకటేశ్, మీనాక్షి చౌదరిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మరో నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇచ్చారు. సీనియర్ దర్శకుడు రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. మరో దర్శకుడు వంశీ పైడిపల్లి స్ర్కిప్ట్ అందజేశారు. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల మధ్య తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ సినిమాలో వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్నారు. ఉపేంద్ర లిమాయే. రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేశ్, వి.టి. గణేశ్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, ఆనంద్‌రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేశ్ బాలరాజ్ ఇతర ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: సమీర్ రెడ్డి, ఎడిటింగ్: తమ్మిరాజు, సహ రచయితలు: ఎస్.కృష్ణ, జి.ఆదినారాయణ.

లేడీ క్యారెక్టర్‌లో విశ్వక్‌సేన్

సినిమా సినిమాకు వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుని మెప్పిస్తున్న విష్వక్‌సేన్.. లేడీ క్యారెక్టర్‌లో కనిపించనున్న చిత్రం 'లైలా'. అయితే ఇందులో ఆయన సినిమా మొత్తం ఇదే గెటప్‌లో ఉంటారా.. కేవలం కొద్ది సేపు మాత్రమే ఈ లుక్‌లో కనిపిస్తారా అనేది సినిమా రిలీజ్ అయ్యేవరకు వేచి చూడాల్సిందే. ఫస్ట్ లుక్‌తోనే విపరీతమైన బజ్‌ను క్రియేట్ చేసిన ఈ 'లైలా' క్యారెక్టర్



థియేటర్లలోకి వచ్చాక ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు రామ్‌నారాయణ్ దర్శకత్వం వహిస్తున్నారు, సాహు గారపాటి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాని ప్రారంభించి ఇందులో విష్వక్‌సేన్ పోషించే 'లైలా' 'ఏ' లుక్‌ను విడుదల చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వగా, దర్శకుడు హరీశ్ శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. వెంకట సతీశ్‌కిలారు, జెమిని కిరణ్ స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సినిమాలో కథానాయికగా ఆకాంక్ష శర్మ నటిస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: అన్వర్ అలీ, డీఓపీ: రిచర్డ్ ప్రసాద్, సంగీతం: జిబ్రాన్.

ఆగస్టులో సెట్స్‌పైకి



'కల్కి 2898 ఏడీ' చిత్రం సూపర్‌హిట్ అయిన ఆనందంలో ఉన్న ప్రభాస్ అభిమానులకు మరో తీపి కబురు. ఆయన కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సలార్' ఫ్రాంఛైజీలో వస్తున్న 'సలార్ 2' చిత్రం సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధమైందని సమాచారం. ఆగస్టు 10 నుంచి ప్రశాంత్ నీల్ చిత్రీకరణ కొనసాగించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. 15 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్, పృథ్వీరాజ్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. 'కల్కి 2898 ఏడీ' విడుదలవ్వడంతో ప్రభాస్ కూడా 'సలార్ 2' పై దృష్టి పెట్టనున్నారు. ఈ చిత్రం 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'సలార్' తొలి భాగం సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. మేకర్స్ ఈ చిత్రానికి కొనసాగింపుగా 'సలార్: శౌర్యాంగపర్వ' పేరుతో రెండో భాగాన్ని ప్రకటించారు. అయితే తొలిభాగాన్ని తెరకెక్కించే సమయంలోనే రెండో భాగానికి సంబంధించి దాదాపు 20 శాతం చిత్రీకరణ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. శ్రుతీహాసన్ కథానాయికగా నటిస్తుండగా, హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తోంది.

చౌకీదార్ చిత్రీకరణ మొదలు



పృథ్వీ అంబర్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'చౌకీదార్' చిత్రీకరణ బుధవారం ప్రారంభమైంది. బెంగళూరులోని బండే మహంకాళి ఆలయంలో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. నిర్మాత కల్లహల్లి చంద్రశేఖర్ క్లాప్ ఇచ్చారు. కీలకపాత్ర పోషిస్తున్న సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ చిత్రంలో ధన్యా రామ్‌కుమార్ కథానాయికగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పృథ్వీ యాక్షన్ రోల్ చేస్తున్నారు. ఆయన పాత్ర కొత్త తరహాలో ఉండబోతోంది. తన పాత్రలో వైవిధ్యం చూపేందుకు ఆయన చాలా కష్టపడుతున్నారు. పృథ్వీ అంబర్ మాట్లాడుతూ 'ఒక్క రోజులో టీజర్‌ను చిత్రీకరించాం. చాలా సరదాగా అనిపించింది. ఈ చిత్రంలో చాలా జీవిత అనుభవాలు ఉన్నాయి. మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్ కథలో ఉన్నాయి' అన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ 'నాకు చాలా సంతోషంగా ఉంది. వచ్చే ఏడాది 50 ఏళ్లు పూర్తవుతున్నాయి. చౌకీదార్ కథ ఎమోషనల్ డ్రామా. ఇది చాలా మంచి సబ్జెక్ట్' అన్నారు. 'ఇది చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. షూటింగ్ త్వరలో ప్రారంభమౌతుంది. పలు భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని నిర్మాత చెప్పారు. సచిన్ బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

సైకో స్టోరీ



రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్నారు. రాధిక శరత్‌కుమార్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ పై 'ఎ సైకో స్టోరీ' అని క్యాప్షన్ పెట్టారు. యాక్షన్ సీక్వెన్స్‌లోని హీరో రక్షిత్ స్టిల్‌తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. ఈ చిత్ర విజయంపై యూనిట్ కాన్ఫిడెంట్‌గా ఉంది. చరణ్‌రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, విద్యాసాగర్, టీవీ 5 మూర్తి, కార్తీక్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: లక్ష్మీ లోహిత్ పూజారి, సంగీతం: శరవణ వాసుదేవన్, ఫొటోగ్రఫీ: నాని చమిడిశెట్టి, ఎడిటింగ్: సత్య గిద్దుటూరి , ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొల్లేటి.



తెలుగు అభిమానుల్ని మిస్ అవుతున్నా

నటి రకుల్ ప్రీత్ సింగ్ 'భారతీయుడు 2' చిత్రంతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. 12న విడుదలవుతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్ నిర్వహించారు. ఇందులో అభిమానులతో పలు విషయాలను ఆమె షేర్ చేసుకున్నారు.

'టాప్ డైరెక్టర్ శంకర్ సినిమాలో నటించడం నా అదృష్టం. ఆయనతో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో నెరవేరింది. ఈ సినిమా విడుదల కోసం చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ఆయన తెరపై సృష్టించే క్యారెక్టర్స్ అద్భుతంగా ఉంటాయి. సెట్‌లో ఆయన ఆలోచనలు, దర్శకత్వ పటిమను చూసి ఆశ్చర్యపోయేదాన్ని. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. తెలుగులో నటించి చాలా కాలమైంది. తెలుగు అభిమానుల్ని మిస్ అవుతున్నా. ప్రస్తుతం తెలుగులో సినిమా చేయడానికే కొన్ని కథలు వింటున్నా. నచ్చిన స్క్రిప్ట్ దొరగ్గానే నటిస్తాను'' అని చెప్పారు.

ఇది మనందరి కథ



నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ ఇది. హృదయాలను కదిలించే భావోద్వేగాలతో దర్శకుడు నందకిశోర్ ఈ సినిమాను రూపొందించారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల్లో ఒకరైన రానా దగ్గుబాటి మాట్లాడుతూ 'నందు ఈ కథ చెప్పినప్పుడు నాకు నేను గుర్తుకు వచ్చాను. నా కోసం అమ్మ పడిన కష్టం స్ఫురణకు వచ్చింది. ఇది మన అందరి కథ. చాలా మంది లైఫ్ ఇలాగే ఉంటుంది. కమర్షియల్ సినిమాలు చాలా వస్తుంటాయి కానీ ఇటువంటి చిత్రాలు చాలా అరుదు. నివేదకి కథ నచ్చితే ఆ కథతోనే ఉంటుంది. సినిమా బాగా రావడానికి ఎంతో సపోర్ట్ చేస్తుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది' అన్నారు. 'నా కెరీర్‌లో బెస్ట్ అంతా రామానాయుడు స్టూడియోలోనే జరిగింది. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత నాకు రానా మొదట పరిచయమయ్యారు. నా కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిల్మ్ '35.. చిన్న కథ కాదు'. ఇందులో మదర్ రోల్ పోషించా. ఇంతవరకూ నేను చేసిన పాత్రలకు చాలా భిన్నమైంది' అన్నారు. మనసును కదలించే సినిమా ఇదని నటుడు విశ్వదేవ్ చెప్పారు. ఈ సినిమాను రానా నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారని చిత్ర నిర్మాత సృజన్ యరబోలు చెప్పారు. ఇది చిన్న సినిమా కాదనీ.. చాలా పెద్ద సినిమా అని ఆయన తెలిపారు.

ఆకట్టుకునే అన్నాచెల్లెళ్ల కథతో



అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే గ్రామీణ కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'చిట్టి పొట్టి'. భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బేనర్‌పై భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. రామ్ మిట్టకంటి, పవిత్ర, కన్వి ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుటుంబ అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఒక ఆడబిడ్డకు పుట్టింటిపై ఉన్న మమకారాన్ని తెలిపే చిత్రమిది. మహిళల గొప్పతనం నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని చెప్పారు. కాంతమ్మ, ఆచారి, హర్ష కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీ వెంకట్, సినిమాటోగ్రఫీ: జోషీ, ఎడిటర్: బాలకృష్ణ బోయ

ఆ సమయం వస్తే నేనే చెప్తా



'రన్ రాజా రన్' చిత్రంతో తెలుగుతెరకు పరిచయమయ్యారు సీరత్‌కపూర్. చాలా గ్యాప్ తర్వాత 'మనమే' చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో మెప్పించారు. నటిగా, గాయినిగా రాణిస్తోన్న సీరత్.. ఈ మధ్య లవ్‌లో పడ్డారని.. అమన్ సింగ్ అనే నటుడితో డేటింగ్‌లో ఉన్నారంటూ రూమర్స్ వస్తున్నాయి. ఈ విషయమై ఓ విలేఖరి ఆమెను ప్రశ్నించగా.. ఇలా సమాధానమిచ్చారు. 'ప్రస్తుతం నా ఫోకస్ అంతా కెరీర్, ఫ్యామిలీ పైనే ఉంది. నేను ఏ విషయాన్ని దాచుకునే వ్యక్తిని కాదు. ఒకవేళ నా వ్యక్తిగత జీవితం గురించి మీ అందరికీ ఏ విషయమైనా తెలియాల్సిన సమయం వస్తే నేనే ముందుగా చెప్తాను. సినిమాల ఎంపికలో నా మనసు మాట వింటా. సినిమాల్లో నేను పోషించే పాత్రలు చాలా బాగుంటాయని అభిమానులు ప్రశంసిస్తుంటారు. అది నాకెంతో ఆనందాన్నిస్తుంది. ఈ ప్రశంసలు.. గుర్తింపు.. నేను పోషించే పాత్రలను మరింతగా ఆచితూచి ఎంచుకునేలా చేస్తాయి' అని చెప్పారు. రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అమన్.. నటుడిగా సినిమాల్లో పలు సినిమాల్లో నటించారు. సీరత్ కపూర్ ఆలపించిన 'ఆవో నా' పాటలో సీరత్‌తో కలసి నటించారు. ఈ పాటలో వారిద్దరి కెమెస్ట్రీ అందరినీ ఆకట్టుకుంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/gt8lkfR
లో చదవండి.

సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం: కోండ్రు

● ప్రజా దర్బార్‌కు భారీగా వినతులు

రాజాం, జూలై 3: రాజాం నియోజకవర్గ పరిధిలోని రాజాం, రాజాం రూరల్, సంతకవిటి మండలాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి భారీస్థాయిలో వినతులు వచ్చాయి. బుధవారం ఉదయం సంతకవిటి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌కు మంచి స్పందన కనిపించింది. భారీ సంఖ్యలో వినతులు వెల్లువెత్తాయి. మధ్యాహ్నం రాజాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో సాయంకాలం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. సుమారుగా మూడు ప్రాంతాల్లో 1300 వరకు వినతులు వచ్చాయి. ప్రజలు ఇచ్చిన వినతులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అంచలంచెలుగా పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ప్రధానంగా మంచినీరు, శానిటేషన్, ఎలక్ట్రికల్, రహదారులు, తాగునీరు, వీధి దీపాలు, పింఛన్లు, ఇంటిస్థలాలు మంజూరు, గృహాలు మంజూరు.. తదితర సమస్యలపై వినతులు అందాయి. అవసరమైతే సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని, ప్రజా సమస్యలపై దృష్టిపెట్టకుండా దోచుకోవాలనే ఆలోచనే వైసీపీ నాయకులకు ఉండేదన్నారు. కనీసం అడుగు రోడ్డు కూడా వెయ్యని పరిస్థితి ఉందన్నారు. కంచరాం మేజరు పంచాయతీకి సంబంధించి పలు సమస్యలు పరిష్కరించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు టంకాల పాపినాయుడు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్ల అప్పలనాయుడు, కమిషనర్ రామప్పలనాయుడు, తహసీల్దార్ ఎస్ కృష్ణంరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారతు.



వినతులు స్వీకరిస్తున్న కోండ్రు

విద్యాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● కోళ్ల లలిత కుమారి

లక్కవరపుకోట, జూలై 3: విద్యాభివృద్ధి జరగాలంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వల్లే సాధ్యమని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం ఆమె స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులకు విద్యాకిట్స్‌ను అంద చేశారు. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ గత సమైఖ్యాంధ్రాలోను, విభజిత ఆంధ్రప్రదేశ్‌లోను విద్యాభివృద్ధి జరిగిందంటే చంద్రబాబునాయుడు వలనే సాధ్యమైందన్నారు. విద్యావ్యవస్థలో విద్యా ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. విదేశీవిద్య, ఐటీ రంగం, ఎంతో జరిగిందన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ జరుగుతుందనే భరోసా నిరుద్యోగులలో ఉంటుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామి మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు సిద్ధమైందన్నారు. గత ప్రభుత్వం దగా డీఎస్సీ తీసుకొస్తే ఎన్‌డీఏ ప్రభుత్వ మెగా డీఎస్సీని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపరిశీలకులు పాల్‌దండే, టీడీపీనాయకులు కరెడ్ల ఈశ్రరావు, మండల విద్యాశాఖాధికారి కూర్మారావు, తహీశీల్దార్ డిఎంజీఎస్ ప్రసాద్, ఎంపీడీఓ రూపేష్, ప్రిన్సిపాల్ ప్రవీణ పాల్గొన్నారు.

● **శృంగవరపుకోట రూరల్:** ఎన్నికలలో తనను గెలిపిస్తే కిర్ల గ్రామానికి ఆర్టీసీ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట నిలబెట్టుకున్నారని గ్రామస్తులు అభినందించారు. బుధవారం కిర్ల గ్రామానికి బస్సు సర్వీసును ఎస్.కోట డిపో మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను భ్రష్టు పట్టించిందని అన్నారు. ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచిన గ్రామస్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ఆనందం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పీటీసీ బండారు పెదబాబు, టీడీపీ నాయకులు వర్రి రమణ, ఎల్.కోట మాజీ జడ్‌పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, కలగాడ శ్రీను, దాసరి చినసత్యం, పీవీ ఆర్ వర్మ రాజు, దళిత మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు పత్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) అందించిన మొక్కలను నాటారు. విద్యార్థులకు పుస్తకాల కిట్‌ను అందించారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఇందుకూరి సుధారాజు, ఎంపీపీ సండిసోమేశ్వర రావు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, నాయకులు కాపుగంటి శ్రీనివాసరావు, చెక్క కిరణ్, నానిగిరి రమణాజీ, వాకాడ బాలు, బోనంగి జ్యోతి, జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తదితరులు వున్నారు.



విద్యాకిట్లను పంపిణీ చేస్తున్న లలితకుమారి

పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

● ఆర్‌డీ నాగరాజు

విజయనగరం రింగురోడ్డు, జూలై 3: పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు మున్సిపల్ రీజనల్ డైరెక్టరు నాగరాజు ఆదేశించారు. బుధవారం నగరానికి చేరుకున్న ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ముందుగా దాసన్నపేట ఓరుగంటి వారి తోటకు చేరుకుని అక్కడ పూడికతీత పనులను పరిశీలించారు. ఆ తరువాత గుణుపూర్‌పేటలో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లెక్సీ వేస్ట్ మేనేజ్‌మెంటు పని విధానాన్ని గమనించారు. అనంతరం కొత్తపేటలో కుక్కల శస్త్రచికిత్సల కేంద్రాన్ని పరిశీలించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. తినుబండారాల దుకాణాలు, హోటళ్లలో పరిశుభ్ర వాతావరణం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు, సహాయ కమిషనర్ తిరుమల రావు, ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి, ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఫోటోరైటప్:3 విజడ్వీ 5:



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్‌డీ నాగరాజు

'విజయనగరం వెలుగులు' పుస్తకావిష్కరణ

విజయనగరం రూరల్: కళలు, సాంస్కృతిక రాజధానిగా భాసిల్లిన విజయ నగరంలో ఎంతో మంది మహానుభావులకు జన్మస్థలమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు జీవీఎస్ జయపాలరావు రచించిన 'విజయనగరం వెలుగులు' పుస్తకావిష్కరణ కార్యక్ర మం స్థానిక ఎస్ కన్వెన్షన్‌లో బుధవారం జరిగింది. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పుస్తకం భావితరాలకు దిక్సూచిగా నిలుస్తుంద న్నారు. 175 మంది ప్రముఖుల గురించి ఈ పుస్తకంలో ఎన్నో విషయాలు పొందు పరిచిన రచయితను ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రచయిత జయపాలరావు తదితరులు పాల్గొన్నారు.



'విజయనగరం వెలుగులు' పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ఆధ్యాత్మికతతో ఆదర్శ జీవనం

విజయనగరం దాసన్నపేట, జూలై 3: ఆధ్యాత్మికతతోనే మానసిక వికాసం సాధ్యమవుతుందని, తద్వారా ఆదర్శ జీవనాన్ని సాగించవచ్చునని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ముఖ్య కేంద్రం మౌంట్‌అబూ నుంచి వచ్చిన రాజయోగి బీకే భగవాన్ భాయిజీ అన్నారు. బుధవారం కంటోన్మెంట్‌లోని ఖమ్మవీధిలో ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి రాజయోగిని బీకే అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ రాజయోగ సాధన చేయా ల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పాజిటివ్ ఆలోచనలు అలవర్చుకోవాలన్నారు. ఇది కేవలం మెడిటేషన్‌తోనే సాధ్యమవుతుందన్నారు.



మాట్లాడుతున్న భగవాన్‌భాయిజీ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● వన్‌టౌన్ సీఐ వెంకట్రావు

విజయనగరం క్రైమ్, జూలై 3: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ వెంకట్రావు సూచించారు. బుధవారం ఎమ్ఆర్ కళాశాలలో మారక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా మారక ద్రవ్యాలు-దుష్పరిణామాలు.. యువత పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేడు యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు, అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతున్నారని, దీంతో భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ఇటువంటి కేసుల్లో ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రముఖ వ్యక్తిత్వ నిపుణులు, రచయిత అలజంగి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలతో మొదట సరదాగా మొదలై క్రమేపీ వాటికి బానిసలుగా మారుతున్నారన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా, చైన్ స్నేచింగ్ వంటి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వీటికి దూరంగా ఉండటం మంచిదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వై ఖాశీప్రసాద్, ఎస్సైలు నరేష్, హరిబాబు నాయుడు, నవీన్ పడాల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ వెంకట్రావు

కళాను కలిసిన కొండపల్లి

రాజాం: చీపురుపలి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును రాజాం క్యాంపు కార్యాల యంలో బుధవారం రాష్ట మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలు సుకున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రధాన సమస్యలుపై చర్చించారు. ముందుగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమస్యలపై మాట్లాడారు. రాష్ట్రంలో నిరు ద్యోగ యువత అధికంగా ఉందని.. మన ప్రాంతానికి పరిశ్రమలు రావడానికి కృషి చేయాలని కళా కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ యువతకు ఉపాధి క ల్పనే ధ్యేయంగా పనిచేస్తానని, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసు కువెళ్లి.. ఈ ప్రాంతానికి పరిశ్రమలు రావడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఆయనతో పాటు గంట్యాడ మాజీ ఎంపీపీ కొండలరావు ఉన్నారు.



కళాతో మంత్రి శ్రీనివాసరావు

అలజంగిలో ఇసుక బహిరంగ వేలం?

బొబ్బిలి: వేగావతి నదీ పరీవాహక ప్రాంతాలలోని గ్రామాలలో ఇసుక అక్రమ విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలజంగి, పా రాది, పెంట, కారాడ తదితర గ్రామాల్లో ఇసుక విక్రయాలను కొంతమంది యథేచ్ఛగా సాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలజంగి గ్రామంలో మూ డు నెలలకు రూ.1.20 లక్షలు చెల్లించి ఇసుకను యథేచ్ఛగా అమ్ముకునేందుకు వేలం పాట నిర్వహించినట్లు సమాచారం. ఈ అక్రమాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమాలు జరిగితే చర్యలు తప్పవు

అలజంగి గ్రామంలో ఇసుక అమ్మకాలకు సంబంధించి అనధికారికంగా వేలం నిర్వహించినట్లు సమాచారం లేదు. దీనిపై ఆరా తీస్తాం. నిఘా పెడతాం. ఇసు క అక్రమాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మూడు శాఖలు కలిసి నియంత్రణకు కృషి చేస్తాం.

-మలిరెడ్డి నాగేశ్వరరావు, సీఐ, కల్యాణ చక్రవర్తి, ఆర్ఐ, బొబ్బిలి

వేపాడ మీదుగా బస్సులు నడపాలి

వేపాడ: గతంలో మాదిరిగా వేపాడ మీదుగా ఆర్టీసీ బస్సులను నడిపి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని మండల మాలమహానాడు అధ్యక్షుడు దేబారిక కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం వేపా డలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. వేపాడ మండల కేంద్రం మీదుగా ఆర్టీసీ బస్సులు నడపకపోవడం ఘోరమన్నారు.

ఎస్‌టీ హాస్టళ్ల తనిఖీ

బొబ్బిలి: పట్టణంలో గల గిరిజన బాలికల హైస్కూలు, బాలుర, బాలికల వసతిగృహాలను బుధవారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి బి.రామానందం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

లక్కవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఎంఈఓకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, ఉపాధికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.20 చెల్లించాలి, ప్రతి నెల 5వతేదీలోపు గౌరవ వేతనం బిల్లులు చెల్లించాలని కోరారు. భోజన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గొల్ల దేవి, ఆదిలక్ష్మి, తరణి, వెంకటమ్మ, జాగారపు కాసులమ్మ, లెంక రమణమ్మ, కొసూరి దేవి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూలై 3: ఏపీపీటీడీ హైర్ బస్సు ఆన్‌కాల్ డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని... డ్రైవర్లను జైలుకు పంపే బీఎన్ఎస్ చట్టం 106 (1, 2) రద్దు చేయాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు, అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ఎన్ రాజు, జి.సురేష్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 10న కలెక్టరేట్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా యాజమాన్యం శ్రమదోపిడీకి పాల్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు ప్రణాళిక

విజయనగరం రింగురోడ్డు, జూలై 3: నగరంలోని పార్కుల సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు చెప్పారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యానవన శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ ఉద్యానవన శాఖాధికారి ఉమాభరణి, ఉద్యానశాఖ డీఈ ప్రవీణ్ కుమార్‌లతో పార్కుల్లో చేపట్టబోయే కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నగరంలో ప్రస్తుతం నాలుగు పార్కులు అన్ని హంగులతో అభివృద్ధి చెందాయన్నారు. మిగిలిన 80 పార్కుల్లో మొక్కలు పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఈఈ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంకిలిలో పారిశుధ్య పనులు

రేగిడి, జూలై 3: సంకిలి గ్రామంలో బుధవారం నుంచి పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సర్పంచ్ బి. పట్టాభి, పంచాయితీ కార్యదర్శి శివరామకృష్ణ ఆధ్వర్యంలో కాలువల్లో పూడికల తొలగింపు, నీటి వనరుల్లో క్లోరినేషన్ చేస్తున్నారు. సంకిలితో పాటు చిన్నయ్యపేట, బొడ్డవలసలో పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు సర్పంచ్, కార్యదర్శులు తెలిపారు.

నేడు విద్యార్థి సంఘాల బంద్

దాసన్నపేట, జూలై 3: కేంద్ర ప్రభుత్వం నీట్ ప్రవేశ పరీక్ష సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం దేశ వ్యాప్తంగా బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపు ఇచ్చినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలలు, పాఠశాలలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

6న గంటి వర్ధంతి

బొబ్బిలి: కార్మిక నేత గంటి ప్రసాదం వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 6న స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో నిర్వహించనున్నట్లు ప్రగతిశీల కార్మిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు తమటాల అప్పలనాయుడు, రాయితీ సత్యం తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. గంటి అభిమానులు, అభ్యుదయ భావాలు కలిగిన వారంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పీకేఎస్ నాయకులు నల్లి తవిటి నాయుడు, పిల్లా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్లూరి జయంతి

కలెక్టరేట్: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఈనెల 4న కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటలకు వేడుకలు నిర్వహిసున్నట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రటకనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరుకావాలని కోరారు.

అన్ని పాఠశాలల్లోనూ నిర్వహించాలి

రేగిడి, జూలై 3: స్వాతంత్ర్య సమయోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఈ నెల 4న గురువారం అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని ఎంఈవో వరప్రసాదరావు బుధవారం ఒక ప్రకట నలో సూచించారు. విద్యార్థులను భాగస్వామ్యం చేసి స్వాతంత్ర్య యోధుడుకి నివాళులర్పించాలని కోరారు.

భీమసింగి సుగర్స్ తెరిపించాలని మంత్రికి వినతి

జామి: గత వైసీపీ ప్రభుత్వంలో ఆధునీకీకరణ పేరుతో మూసివేయించిన భీమసింగి చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరిపించి చెరుకు రైతులను, కార్మికులను ఆదుకోవాలని కోరుతూ మండల టీడీపీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం విజయనగరంలో కలిసి వినతి పత్రం అందించి మాట్లాడారు. కర్మాగారం తెరిపించడంతో పాటు గతంలో మూసివేత సమయంలో కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు, ఇతర అలవెన్సులు ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉంచారని, అవికుడా అందించాలని కోరారు.

న్యాయవాదుల మృతికి పరిహారం పెంపు

కొత్తవలస, జూలై 3: న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తూ మరణిస్తే రాష్ట్ర బార్ కౌన్సిల్ ద్వారా మంజూరు చేసే పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని న్యాయవాద సంఘ అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ తరువాత మృతి చెందిన వారికి మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. గతంలో న్యాయవాది మృతి చెందితే రూ.4 లక్షల వరకు మంజూరు చేసేవారన్నారు. ఈ మొత్తాన్ని మృతి చెందిన న్యాయవాది కుటుంబానికి అందజేయనున్నట్టు తెలిపారు.

జేఎస్ఎల్‌పై నిర్ణయం వచ్చే వారం చెబుతాం

కొత్తవలస: అప్పన్నపాలెంలోని జిందాల్ నగర్‌లో నున్న జేఎస్ఎల్ కర్మాగార యాజమాన్యం అక్రమ లాకౌట్ విషయమై పరిష్కారాన్ని తాత్సారం చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. బుధవారం కార్మిక సంఘాలకు, యాజమాన్యానికి మధ్య చర్చలు జరుగుతాయని భావించారు. యాజమాన్యం ఏదో ఒక నిర్ణయం చెబుతుందని కార్మికులు భావించారు. తమ టాప్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి వచ్చే బుధవారానికి తమ నిర్ణయం చెబుతామని యాజమాన్యం స్పష్టం చేసింది. దీంతో స్థానిక యాజమాన్య ప్రతినిధులు ఉద్దేశపూర్వకంగానే వాయిదాలు వేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు నెక్కల నాయుడుబాబు, పిల్లా అప్పలరాజు, నమ్మి చినబాబు, బి.ఈశ్వరరావు, గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

వంగర: గత ప్రభుత్వం అనాలోచిన నిర్ణయంతో ప్రవేశపెట్టిన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని... లేకుంటే ప్రభుత్వ బడులు పిల్లలు లేక మూతపడే ప్రమాదం ఉందని యూటీఎఫ్ నాయకులు పల్ల మురళి, పక్కివాసు డిమాండ్ చేశారు. బుధవారం అరసాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జీవో 117తో విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాస్, సింహాచలం, తిరుపతి, ఖైరాం, జ్యోతి, చూడామణి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి జైలు

విజయనగరం క్రైమ్, జూలై 3: జిల్లాలోని పూసపాటిరేగ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో అదే గ్రామానికి చెందిన నిందితులు రాగితి సత్తయ్యకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2500 జరిమానా, వాసుపల్లి కన్నయ్యకు ఏడాది జైలు, 500 రూపాయల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి బుధవారం తీర్పు వెలువరించినట్లు దిశా పోలీస్ స్టేషన్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. సత్తయ్య, కన్నయ్య 2021 ఆగస్టు 26న మైనర్ బాలికను అపహరించి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు దిశా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై కేటీఆర్ లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు. న్యాయస్థానంలో అభియోగ పత్రాలను దాఖలు చేశారు. నిందితులపై నేరారోపణ రుజువు కావటంతో ప్రత్యేక న్యాయస్థానం ఈ తీర్పునిచ్చింది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కురుపాం రూరల్: తాగుడుకు బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన బుధవారం కురుపాం మండలం గుంజరాడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గుంజరాడ గ్రామానికి చెందిన బిడ్డిక రవి(34) మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. దీంతో అతని భార్య సీతమ్మ మద్యం మానాలంటూ రవిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన రవి ఇంట్లో ఉన్న కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవిని భద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. రవికి మోక్షిత, అఖిల, నాని అనే ముగ్గురు చిన్నపిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి అరెస్ట్

రాజాం రూరల్, జులై 3: మండల పరిధిలోని చీకటిపేట జంక్షన్ వద్ద పోలీసులు బుధవారం నిర్వహించిన తనిఖీలలో రాజాం పట్టణంలోని కూరాకుల వీధికి చెందిన జక్కం దీపక్ గంజాయితో పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. దీనికి సంబంధించి ఏఎస్ఐ భాస్కర్రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దీపక్ గంజాయి తాగడానికి అలవాటు పడి ఒడిశా నుంచి తరచూ రాజాం ప్రాంతానికి గంజాయిని తీసుకువస్తున్నాడు. తాను వినియోగిస్తూ తన అవసరాల కోసం గంజాయిని అమ్మేవాడు. ఈ క్రమంలో బుధవారం గంజాయితో పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేశామని భాస్కర్రావు వివరించారు.

కొత్త చట్టంలో తొలి వేధింపుల కేసు

కొత్తవలస, జూలై 3: భార్యను వేధిస్తున్న భర్తపై కొత్తగా తీసుకొచ్చిన బీఎన్ఎస్ చట్టం సెక్షన్85, 115(2) రెడ్ విత్ 3(5)ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, తుమ్మలపాలెం గ్రామానికి చెందిన పాము నూకరాజు కుమార్తె మనీషాకు మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన ఉగ్గిన రాంబాబుతో వివాహం చేశారు. తన అల్లుడు రాంబాబు తన కుమార్తెని సక్రమంగా చూసుకోకుండా తరచూ వేధిస్తూ కొడుతున్నాడు. ఈ విషయం తెలిసి అప్పన్నదొరపాలెం గ్రామంలోని అల్లుడి ఇంటికి మంగళవారం వచ్చి అడిగినందుకు కొట్టాడు. తనను తనభర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని భార్య మనీష చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బాధితులకు మొబైల్స్ అందజేత

విజయనగరం క్రైమ్, జూలై 3: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 118 మొబైల్స్‌ను బాధితులకు సైబర్ క్రైమ్ పోలీసులు అప్పగించారు. బుధవారం ఎస్పీ దీపిక ఆదేశాలతో సోషల్ మీడియా సైబర్ సెల్ సీఐ విజయ్‌కుమార్ సైబర్ పోలీస్ స్టేషన్ వద్ద బాధుతుల ఆధారాలు సేకరించి వారి మొబైళ్లను అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న మొబైల్స్ గురించి ఫిర్యాదు చేసిన కొద్ది రోజుల్లోనే 118 మొబైళ్లను ట్రేస్ చేశామన్నారు. ఆన్‌లైన్ ద్వారా సైబర్ పోలీస్ స్టేషన్‌లో నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వాటిని ట్రేస్ చేసి అందజేశామన్నారు. 11మంది నేరస్తులు గంజాయి అక్రమ రవాణ హత్యలు, ఇతర నేరాలు చేసేందుకు మొబైళ్లను వినియోగించుకున్న తరువాత మొబైళ్లను పారవేస్తారని ఎవరైనా వాడినట్లయితే పోలీసులు, కోర్టుల నుంచి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయన్నారు. దొరికిన మొబైళ్లను స్టేషన్‌కు అప్పగించడం మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్సైలు ప్రశాంత్‌కుమార్, నసీమా బేగమ్, పీసీలు తిరుపతి, శ్రీనివాసరావు, రాజేష్, శిరీష సిబ్బంది పాల్గొన్నారు



బాధితులకు ఫోన్లను అందిస్తున్న సీఐ విజయ్‌కుమార్

వాతావరణాన్ని శుభ్రపరిచేవి మొక్కలే

రాజాం రూరల్: మొక్కలు వాతావరణాన్ని శుభ్రపరుస్తాయని, శబ్ద, వాయు కాలుష్యాన్ని నియంత్రిస్తాయని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీవీ రమణమూర్తి అన్నారు. మనిషికి ప్రాణవాయువును అందించే శక్తి మొక్కలకే ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వ ఐటిఐలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ఆమె కళ్లు సజీవం

కొత్తవలస : కొత్తవలసకు చెందిన తీగెల గున్నలక్ష్మి(70) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈమె కంటి కార్నియాలు దానం ఇస్తే మరో ఇద్దరికి కంటి చూపు వచ్చే అవకాశం ఉందని కొత్తవలసకు చెందిన నేత్రదానాలపై అవగాహన కల్పించే సామాజిక కార్యకర్త విన్నకోట రాజేష్ చెప్పారు. అందుకు లక్ష్మి కుమారులు సన్యాశెట్టి, అప్పలనరసయ్య, కుమార్తెలు నూకరత్నం, నాగలక్ష్మి అంగీకరించారు. ఈ మేరకు విశాఖకు చెందిన మోహిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో ఆ బ్యాంక్‌కు చెందిన ప్రతినిధులు వచ్చి కార్నియాలు సేకరించారు.

గ్రామాల్లో కౌలు రైతు సదస్సులు

లక్కవరపుకోట: కౌలు రైతులకు కార్డులు అందించేందుకు అధికారులు గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. 2024-25 సంవత్సరానికి గాను కౌలు రైతు కార్డులు అందించేందుకు వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ ఉమ్మడిగా బుధవారం వీరభద్రపేట,తలారి, కొట్యాడ, ఖాసాపేత గ్రామాలలో సదస్సులను నిర్వహించాయి. ఈ ఏడాది 710 మంది రైతులకు కౌలు రైతు కార్డులు అందచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయాధికారి స్వాతి తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రేగిడి: కాగితాపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సత్యసాయి భజన మండలి, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా శిబిరాన్ని నిర్వహించాయి. విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్, బూరాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. 51 మందికి వైద్య పరీక్షలు చేశారు. 32 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సత్యసాయి కన్వీనరు తవిటినాయుడు, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ అలేఖ్య, క్యాంపు కోఆర్డినేటర్ సీహెచ్ అశ్వనికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నుంచి రక్షణపై అవగాహన

బొబ్బిలి: జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం బొబ్బిలి రెవెన్యూ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, వరదలు, భారీ అగ్ని ప్రమాదాలు తదితర విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో విశాఖ టెన్త్ బెటాలి యన్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్ కుమార్ బెహరా, తహసీల్దారు త్రినాథరావునాయుడు, ఆర్ఐ కల్యాణచక్రవర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఇండియన్ మిషన్ టీం విన్నపం

జామి: నూతన కలెక్టర్ అంబేడ్కర్... యువజన సంఘాల బలోపేతానికి కృషి చేయాలని జామి అంబేడ్కర్ ఇండియన్ మిషన్ టీం సభ్యులు కోరారు. బుధవారం విజయనగరంలో ఈ టీం సభ్యులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ భీమారావు, ఎల్.లక్ష్మణరావు, జగదీష్, గణేష్, కాటపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన జామి అంబేడ్కర్ ఇండియన్ మిషన్ టీం

బకాయి వేతనాలు చెల్లించాలి

● మునిసిపల్ క్లాప్ వాహనాల డ్రైవర్లు కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న క్లాప్ వాహనాల డ్రైవర్లు

పార్వతీపురంటౌన్: తమకు బకాయిపడిన వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని మునిసిపల్ క్లాప్ వాహనాల డ్రైవర్లు కోరారు. ఈమేరకు బుధవారం మునిసిపల్‌కార్యాలయంలోకమిషనర్ కె.శ్రీనివాసరావును కలిసి సమస్యను వివరించారు. జూన్ నెల వేతనంతో కలిపి మూడు నెలల వేతనం చెల్లించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.పార్వతీపురం మునిసిపాలిటీ లోనే డ్రైవర్లకు వేతనాలు బకాయిలు ఉన్నాయని, ఇతర మునిసిపాలిటీల్లో ఇలాంటి పరిస్థితి లేదని చెప్పారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి తమకు బకాయిపడిన వేతనాలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.వేతనాల బకాయిలు చెల్లించేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడుతానని కమిషనర్ హామీఇచ్చారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి



బుక్కూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పాలకొండ: మండలంలోని బుక్కూరులో డెంగ్యూ జ్వరాలపై ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వైద్యసిబ్బంది కోరారు. బుధవారం బుక్కూరు సెక్రటరీ ప్రశాంతి,సీహెచ్‌వో కమలజోషి, ఏఎన్ఎం రాజేశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు హిమప్రభ, దివ్య, ఆశకార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు.

అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ విజేత అచ్చెబవలస



అచ్చెబవలస క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

సీతంపేట: మండలంలోని దేవనాపురంలో జరిగిన అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో అచ్చెబవలస జట్టు విజేతగా నిలిచింది. గత నెల రెండో తేదీన ప్రారంభమైన ఈ క్రికెట్ టోర్నీలో 96 జట్లు పాల్గొనగా, బుధవారం ఫైనల్ జరిగింది. ఈ మేరకు ఫైనల్‌లో అచ్చెబవలస, కె.కొత్తగూడ జట్లు తలపడాయి. తొలుత బ్యాటింగ్‌చేసిన కొత్తగూడ 76 పరుగులు చేయగా, అచ్చెబవలస జట్టు ఎనిమిది ఓవర్లలో78 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా ప్రవీణ అందుకున్నారు. విజేతలకు సీతంపేట స్టేట్‌బ్యాంక్ మేనేజర్ సాయిరాజు బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో సూరిబాబు, ప్రభాకర్, ప్రకాష్‌రావు, రవి, జగన్ పాల్గొన్నారు.

గర్భిణుల సేవలు నమోదు చేయాలి

● గరుగుబిల్లి మండల వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ

గరుగుబిల్లి: గర్భిణుల ఆరోగ్యంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ సూచించారు. గ్రామాల్లో అందిస్తున్న గర్భిణుల ఆరోగ్య సేవలను విధిగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.బుధవారం మండలంలోని కొత్తూరులో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. గర్భిణుల్లో హైరిస్క్ తలెత్తకుండా సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.జ్వరలక్షణాలు ఉంటే సమాచారం అందించాలన్నారు. డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకు అధికంగా నీరు, ద్రవ రూప ఆహారాన్ని తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పిస్తున్నామని, కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారుల ఆరోగ్యంపై పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలను సక్రమంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రమణమ్మ, స్వాతి, దుర్గా ప్రసాద్, శంకరరావు పాల్గొన్నారు.

ఏబీ స్విచ్ ఏర్పాటు చేయాలి

● సబ్‌స్టేషన్ వద్ద కోదుపెద్దవలస గ్రామస్థుల నిరసన

మక్కువ: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీస్విచ్ ఏర్పాటు చేయాలని కోదుపెద్దవలస గ్రామస్థులు కోరారు.ఈ మేరకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఎటువంటి విద్యుత్ సమస్యలు ఎదురైనా ఎల్‌సీ తీసుకోవడంలో ఆలస్యమవుతోందని చెప్పారు. ఆన్‌ఆఫ్ బోర్డు ఏర్పాటు చేయడం వల్ల సమస్య సత్వరమే పరిష్కారమవుతుందని తెలిపారు. విద్యుత్ ఏఈ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతిపత్రం అందించారు.

కరాటేలో రాయగడ వాసికి బంగారు పతకం

రాయగడ: మలేషియా పెరాక్‌లో ఇటీవల జరిగిన 20వఅంతర్జాతీయ ఒకినావా గోర్యు ఇపోహ సిటీ ఓపెన్‌కరాటే చాంపియన్ పోటీలో రాయగడ క్రీడాకారుడు ఎల్.రమేష్‌కుమార్ బంగారు పతకం సాధించాడు. సింగపూర్, మలేషియా,జపాన్ ఆటగాళ్లతో ఆడి పతకంసాధించినందుకు రమేష్‌కుమార్‌ను లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వై. వెంకటేశ్వరరావు అలియాస్ కొండబాబు సన్మానించారు.



రమేష్‌ను సన్మానిస్తున్న కొండబాబు

బంగారం గొలుసు దొంగతనం

రాయగడ: రాయగడలోని జగన్నాథ మందిర సమీపంలో ఓ వృద్ధురాలి మెడలో గొలుసు దొంగతనంచేసిన ఘటన బుధవారం వేకువజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాయగడ అనసూయ (75) రోజు మాదిరిగా బుధవారం వేకువజామున నాలుగు గంటలకు దుకాణం తెరిచింది. ఇంతలో గుర్తుతెలియని వ్యక్తిగుట్కా కవాలని ఆమెను అడిగాడు. గుట్కా ఇచ్చే సమయంలో అనసూయ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం గొలుసుతో పాటు మరో వెండి గొలుసును తెంపుకుని పరారయ్యాడు. అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత

● అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రోయత్

రాయగడ: బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత అని అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రోయత్ తెలిపారు. రాయగడలోని జిల్లాపరిషత్ సమావేశ హాలులో బాలల సంరక్షణ సామాజిక బాధ్యత అన్నఅంశంపై సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సంరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు,వారి రక్షణకు వివిధ విభాగాలు కృషిచేస్తున్నాయని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అన్ని వివాహాల వివరాలు నమోదుచేస్తున్నట్లు చెప్పారు. వివాహ సమయంలో వధూవరుల తలిదండ్రులు తమ పిల్లల వయసు వివరాలను తెలియజేయలన్నారు.దీంతో బాల్యవివాహాలు అరికట్టవచ్చని తెలిపారు. ఈవిషయంలో అధికారులు గ్రామాల్లో తలిదండ్రులను చైతన్యపరచాలని కోరారు.కార్యక్రమంలో జిల్లాలో బాలికల సంరక్షణ, బాలల పరిరక్షణ కమిటీ ,యువజన సాధికారత, బాల్యవివాహాల నివారణ టాస్క్‌ఫోర్స్, బాల కార్మిక నివారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరచంద్ర రోయత్



ఉల్లిభద్ర సమీపంలో గోతిలో దిగిపోయిన వాహనం



గోతుల్లో అవస్థలకు గురవుతున్న వాహన చోదకులు

అడుగడుగునా గోతులు.. తప్పని అగచాట్లు

● వైసీపీ హయాంలో మరమ్మతుకు నోచుకోని పార్వతీపురం-పాలకొండ రోడ్డు

పార్వతీపురం నుంచి పాలకొండ ప్రధానరహదారి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ఈ రోడ్డులో అడుగడుగునా గోతుల కావడంతో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో కనీస మరమ్మతులకు నోచుకో కపోవడంతో ప్రస్తుతం పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఉల్లిభద్ర సమీపంలో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడనిత్యం వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారి దుస్థితిని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితంలేకుండాపోయిందని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు. పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల నుంచి గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్ర వరకు అడుగడుగునా గోతులుఏర్పడడంతో వాహనచోదకులు, ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.గోతులను తప్పించబోయి పలువురు అందులోపడి గాయాలపాలవుతున్న విషయం విదితమే. చీకటిపడిన తర్వాత ఈ మార్గంలో వచ్చే వాహన చోదకులు ఎలా బయటపడాలో తెలియక భయాందోళన చెందుతున్నారు. గోతుల వల్ల ఏ వైపునకు వెళ్లాలో తెలియడం లేదని భారీ వాహనాలతో పాటు బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనచోదకులు వాపోతున్నారు. తక్షణమే కూటమి ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. (గరుగుబిల్లి)

ప్రజల సమస్యలు పరిష్కరించండి

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

వీరఘట్టం: ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు.బుధవారం వీరఘట్టం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. రైతులు నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రవాణా నిధులను ఎంత జమచేశారో వాటి వివరాలు ఇవ్వాలని ఏవో సౌజన్యకు కోరారు. తోటపల్లి ఎడమ కాలువలో ఉపాధి హామీ నిధులతో పూడికలను తొలగించాలని ఏపీవో జి.సత్యనారాయణకు, గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారి బాలా జీకి సూచించారు. చిట్టిపుడివలస, కొట్టుగుమ్మడ, గడగమ్మ, కంబర, చిదిమి, ఎం.రాజపురం రహదారుల పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల కోసం సేకరించిన భూములకు ఎంత డబ్బులు చెల్లించారో వివరాలు ఇవ్వాలని తహసీల్దార్ జయప్రకాష్‌కు కోరారు.కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విస్సీ ప్రవల్లిక, ఏపీఎం బి.శివున్నాయుడు, వీరఘట్టం పీహెచ్‌సీ వైద్యురాలు పి.ఉమామహేశ్వరి, టీడీపీ నాయకులు ఉదయాన ఉదయ్‌భాస్కర్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు, చింతా ఉమ, జానీ పాల్గొన్నారు.

● **పాలకొండ:** పాలకొండ డిపోలో ఆర్టీసీబస్సును ఎమ్మెల్యే జయకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా డిపోలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.



వీరఘట్టం: మాట్లాడుతున్న నిమ్మక జయకృష్ణ

పరికరాలు రికవరీచేయండి

భామిని: రైతులకు ఇబ్బంది లేకుండా విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే జయకృష్ణ వ్యవసాయాధికారులకు సూచించారు. ఎంపీడీవోకార్యాలయంలోఅధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా రైతు సంఘాలకు అందజేసిన యంత్రాలు ఎవరి వద్ద ఉన్నాయి, ఎవరికి ప్రయోజనం కలుగుతుందని ఏవోఎం.మన్మథరావుకు ఎమ్మెల్యే ప్రశ్నించారు. రైతులకు అందించిన పరికరాల వివరాలు అందించాలని, ఇతరులవద్ద ఉంటే ఆర్‌ఆర్ యాక్ట్ ద్వారా రికవరీచేయాలని కోరారు.2019లో గోకులం కింద రైతులకు అందజేసిన పథకం ఇంత వరకు బిల్లులు ఎందుకు చేయలేదని పశువైద్యా ధికారి ఎం.సంతోష్‌కుమార్, ఉపాధి ఏపీవో తులసీదాస్‌ను ప్రశ్నించారు. కార్య క్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ లోపింటి రాజేశ్వరి పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించండి

● దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

● సీపీఎం రాష్ట్ర ప్రతినిధి, మాజీ ఎంపీ మధు



ర్యాలీలో పాల్గొన్న మధు, సీపీఎం నాయకులు

గరుగుబిల్లి: శివ్వాం పరిధిలోని భూసమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర ప్రతినిధి, మాజీ ఎంపీ పి.మధు హెచ్చరించారు. బుధవారం వివాదస్పద భూములను ఆయన పరిశీలించడంతో పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో రెవెన్యూ యంత్రాంగం శివ్వాంలోని దళితులకు 22.80 ఎకరాల భూమిని మంజూరు చేసిందని తెలిపారు. వీరికి డీపట్టాలు ఇచ్చారని, అయితే దళితులు సాగుచేస్తున్న భూములపై పెత్తందారుల కన్ను పడడంతో వీరిపై దాడులకు పాల్పడుతూ దురాక్రమణకు పాల్పడుతున్నారని విమర్శించారు. తప్పుడు సర్వే నెంబర్లతో న్యాయస్థానంలో ఇంజక్షన్ ఆర్డర్లు తెచ్చారని, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సహాయంతో అన్యాయంగా తొలగించారని ఆరోపించారు. పెత్తందారులపై కేసులు నమోదు చేయకుండా దళితులపై తప్పుడు కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీపీఎం నాయకుల రాకతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమై ఘర్షణలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు డి.సుబ్బారావు, సీపీఎం ప్రతినిధి ఎం.కృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, ఆర్.వేణు, వై.మన్మథరావు, ఎం.తిరుపతిరావు, బీవీ రమణ, కొల్లి సాంబమూర్తి, ఎం.శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం పార్వతీపురంలో జిల్లా రెవెన్యూ అధికారికి దళితుల సమస్యలపై వినతిపత్రం అందించారు.

200 రోజులు పనులు కల్పించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

సాలూరు రూరల్: కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు కోరారు. బుధవారం సాలూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి కూలీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో ఎనిమిది వారాలుగా బకాయి ఉన్న వేతనాలు ఉపాధి కూలీలకు చెల్లించాలని కోరారు. వ్యవసాయపనుల్లో యంత్రీకరణ పెరిగిపోవడంతో కూలీలకు పనులకు దొరక్కపోవడంతోకూలీలు వలసలు వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు రూ. 400 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పార్వతికి వినతిపత్రం ఇచ్చారు.కార్యక్రమంలో గాసి,ఈశ్వరరావు పాల్గొన్నారు.

దళితులపై దాడిచేసిన వారిని శిక్షిస్తాం

● డీఎస్పీ కృష్ణారావు



శివ్వాం ఎస్సీకాలనీలో మాట్లాడుతున్న కృష్ణారావు

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామ దళితులపై చేసిన వారిని శిక్షిస్తామని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. బుధవారం శివ్వాం ఎస్సీ కాలనీలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెల 27న దళితులకుచెందిన భూముల్లో సాగు చేసుకుంటున్న సమయంలో సుమారు 16 మంది దళితులపై దాడులకు పాల్పడినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సిద్ధం చేశామన్నారు.గ్రామంలోని భూములకు సంబంధించి పూర్తిస్థాయిలో హక్కులు దళితులకు ఉన్నాయని, వీరికి సంబంధించిన రికార్డులను పరిశీలించామని తెలిపారు.బీసీవర్గీయులు చేస్తున్న అరాచకాలపై ఐదుగురు ఫిర్యాదు చేశారని చెప్పారు. కులదూషణపై విచారణ చేపడుతున్నామన్నారు. బీసీ వర్గీయులతో తమకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అయితే ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా పోలీసులు రక్షణగా ఉంటారన్నారు. కాగా శివ్వాం గ్రామం పోలీసుల వలయంలో ఉంది. డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది గ్రామంలోనే తిష్టవేశారు. సుమారు 150 మందికి పైగా సిబ్బందిని నియమించారు. ఈ కార్యక్రమంలో చినమేరంగి సీఐ బి.మంగరాజు, ఎస్ఐ వై.అమ్మన్నరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కురుపాంలో అభినందన సభ

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌చంద్రదేవ్



మాట్లాడుతున్న వీరేష్‌చంద్రదేవ్

కురుపాం: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విజయోత్సవ ర్యాలీ, అభినందన సభను ఐదుమండలాల నాయకులు,కార్యకర్తలు విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చం ద్రదేవ్ కోరారు. బుధవారం కురుపాంలో అభినందన సభ నిర్వహణకు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం అభినందన సభ నిర్వహణకు తీర్మానించారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక దూళికేశ్వరాలయం నుంచి విజయోత్సవ ర్యాలీ ప్రారంభించి సాయిబాబా ఆలయం వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయం ఎదురుగా ఏర్పాటుచేయనున్న అభినందన సభలో ఐదు మండలాల నాయకులు మాట్లాడుతారని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

పాలకొండ: మండలంలోని అంపిలి గ్రామానికి చెందిన రాజేష్ కుటుంబ సభ్యులకు పూర్వవిద్యార్థులు అండగానిలిచారు. ఈమేరకు రాజేష్ ఇటీవల మృతిచెందాడు. దీంతో బూర్జ జడ్పీపాఠశాలలో ఆయనతో పాటు చదువుకున్న విద్యార్థులు రాజేష్ భార్య, పిల్లలను బుధవారం పరామర్శించారు. ఈ మేరక రూ.20 వేల అందజేశారు. కార్య క్రమంలో రాంబాబు, సత్యనారాయణ, హరినాథ్, నీలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

భామిని: భామినిలో విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ పరీక్షకు ఆదర్శ, జిల్లా పరిషత్, కేజీబీవీ, గురుకులం పాఠశాల నుంచి 21 మంది విద్యారులు హాజరయ్యారు.ఈ మేరకు ఐదుగురికి జిల్లా స్థాయి పోటీలకు పంపించేందుకు ఎంపిక చేసినట్లు ఎంఈవో భాస్కరరావు తెలిపారు. పోటీలను ఎంపీడీవో కిషోర్‌కుమార్ పరిశీలించారు.

ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ

పాలకొండ: పట్టణంలోని గారమ్మకాలనీ సచివాలయం పరిధిలో గల దుర్గారావు అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు వృద్ధాప్య పింఛన్‌ను వార్డు ఎమినిటీ కార్యదర్శి వై.కృష్ణతేజ అక్కడకు వెళ్లి అందించారు. ఆయన వెంట టీడీపీ కార్యకర్త దుప్పాడ వెంకటరమణ ఉన్నారు. అలాగే పట్టణంలోని బోణంవీధికి చెందిన ఓలబ్ధిదారుడు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా శానిటరీ సెక్రటరీ సంతోష్‌కుమార్ పింఛన్ పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సీతంపేట: అగ్నిప్రమాదాలు జరిగేసమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు పాలకొండ అగ్నిమాపకశాఖాధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం సీతంపేట ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను అవగాహనసదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.హేమసుందరరావు పాల్గొన్నారు.

వీరఘట్టంలో రక్తదాన శిబిరం

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం హెల్పింగ్‌హ్యాండ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ తలసేమియావ్యాధితో బాధపడుతున్న వారి చేయూతనిచ్చేందుకు రక్తదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గర్భానసత్తిబాబు, టీడీపీ నాయకులు ఉదయాన ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

మరుపెంటలో గ్రామసభ

గరుగుబిల్లి: పంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని ఎంపీపీ ఉరిటి రామారావు కోరారు. బుధవారం మండలంలోని మరుపెంటపంచాయతీ గ్రామసభను సర్పంచ్ ఉరిటి నిర్మల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అందరి ఆమోదంతో గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయనున్నట్లు తెలిపారు.సర్పంచ్ నిర్మల మాట్లాడుతూ పంచాయతీలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కండేన బలరాంనాయుడు, అక్కేన రామకృష్ణ, గులిపల్లి రామారావు, గ్రామ సచివాలయ సిబ్బంది గంట జనార్ధనరావు, రెడ్డి కుంతి పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన పాండురంగ

వీరఘట్టం: విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను పాలకొండ నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి నిమ్మక పాండురంగ ఉండవల్లిలోని మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో సమస్యలను ఆయనకు పాండురంగ వివరించారు.



బంద్ విజయవంతం చేయండి

మక్కువ: నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ లీకైన ఘటనకు నిరసనగా గురువారం దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు నిర్వహించే విద్యా సంస్థల బంద్‌కు స్కూల్ యాజమాన్యాలు సహకరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎం.హరికృష్ణ పిలుపునిచ్చారు. విలేకరులతో బుధవారం మక్కువలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై ప్రభుత్వం దాడి వ్యతిరేకంగా బంద్ చేపడుతున్నామని చెప్పారు.

కామన్ స్కూల్ విధానం తీసుకురావాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన విద్యావిధానాన్ని రద్దుచేసి కామన్ స్కూల్ విధానాన్ని తీసుకురావాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమహన్‌రావు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. బుధవారం పార్వతీపురంలో యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు వల్ల ప్రాథమిక విద్యారంగం నాశనమైందని, పిల్లల ఎనరోల్‌మెంట్ లక్షలాదిగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుత ప్రభుత్వంతం స్పందించి కామన్ స్కూల్ విధానాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ విద్యా రంగాన్ని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో కె.మురళి, వి.జ్యోతి, గోవిందమ్మ, ఎన్. శ్రీను, పైడి రాజు, శంకరరావు, వెంకటనాయుడు పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయ హుండీల లెక్కింపు

మక్కువ: శంబరపోలమాంబ అమ్మవారి ఆలయహుండీలను బుధవారం లెక్కిం చారు. ఈ మేరకు చదురుగుడి ఆలయంలో రూ.2,28,109, వనంగుడి రూ.1,93,233 మొత్తం రూ.4,21,342 ఆదాయం వచ్చింది.కార్యక్రమంలో బొబ్బిలి తనిఖీదారు ఎస్.రాజకుమారి, ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, సర్పంచ్ సింహాచలమమ్మ, పోలీస్, రెవెన్యూ, సిబ్బంది, గ్రామ పెద్దలు రివున్నాయుడు, తిరుపతిరావు, నరసింగరావు పాల్గొన్నారు.



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది